# చైనాలో చౌకగా ఎంబిబిఎస్

## దేశంలో వైద్య విద్యకు మోకాలడ్డుతున్న భారత వైద్య మండలి ✦ 10 లక్షలకే మెడికల్ సీట్

(కె.వి.రమణమూర్తి/మారం శ్రీనివాస్)

**హైదరాబాద్, ఆగస్టు 19 :** మన దేశంతో పోలిస్తే విదేశాల్లో వైద్య విద్య మరింత అందుబాటులోకి వచ్చింది. లక్షలు వెచ్చించి సీట్లు కొనుక్కునే దానికన్నా చైనా, రష్యా దేశాల్లో మెడికల్ కోర్సుల్లో చేరేందుకు మన దేశ విద్యార్థులు ఎంతో ఉత్సాహాన్ని చూపుతున్నారు. రాష్ట్రానికి చెందిన దాదాపు 5వేల మంది విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో విదేశాల్లో మెడికల్ కోర్సుల్లో చేరారని, దీన్ని బట్టి చూస్తే కొన్ని వేల మంది విద్యార్థులు విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించేందుకు వెళ్తున్నారని ఇటీవల ఓ ప్రయివేటు సంస్థ నిర్వహించిన సర్వేలో తేలింది. మెడికల్ కళాశాలల ఏర్పాటుకు భారత వైద్య మండలి(ఎంసిఐ) మోకాలడ్డుకోవడంతో దేశంలో కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు విద్యా సంస్థలు ముందుకురావడం లేదన్న వాదన వినిపిస్తోంది. వైద్య కోర్సులు అభ్యసించేందుకు విపరీతమైన డిమాండ్ పెరగడం, డిమాండ్‌కు తగ్గట్టు సీట్లు లభ్యం కాకపోవడంతో విధిలేక విద్యార్థులు విదేశాల వైపు మొగ్గుచూపుతున్నారు. భారత వైద్య మండలి ఓ స్వయం ప్రతిపత్తి గల సంస్థ. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఈ సంస్థ పనిచేస్తున్నప్పటికీ ఈ సంస్థకు ప్రత్యేక అధికారాలు, బాధ్యతలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వం చేసే సిఫార్సులను ఏమాత్రం ఖాతరు చేయడంలేదు. భారత వైద్య మండలి ఛైర్మన్‌ను దేశంలోని గుర్తింపు పొందిన వైద్యులందరూ కలిసి రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నుకుంటారు.

అయితే భారతదేశంలోని వైద్య కళాశాల్లో పరిమిత సీట్లుండడం, యాజమాన్య కోటా కింద భర్తీ చేసే సీటుకు **మిగతా 2వ పేజీలో...**

# చైనాలో చౌకగా ఎంబిబిఎస్

(మొదటి పేజీ తరువాయి)

ఒక్కొంటికి 30 నుంచి40 లక్షల రేటు పలకడంతో మధ్యతరగతి వర్గాలకు చెందిన కుటుంబాల విద్యార్థులు తమకు అందుబాటులో ఉండే ఫీజులు గల విదేశీ విద్యను ఎంచుకుంటున్నారు.ఈ పరిస్థితుల మధ్య వైద్య విద్యను ప్రోత్సాహించాల్సిన అవసరాన్ని,అదే సమయంలో వైద్య వృత్తి స్థాయిని నిలబెట్టకునే విధానంలో భారత పార్లమెంటు భారత వైద్య మండలి చట్టం 1956కు 2001లో ఒక సవరణ చేసింది. దీంతో తొలిసారిగా ఒక విధివిధానానికి రూపకల్పన జరిగింది. మన దేశానికి చెందిన విద్యార్థి విదేశీ విద్యను అభ్యసించేందుకు బయలుదేరే ముందు మెడికల్ కౌన్సిల్ నుంచి అర్హత పత్రాన్ని పొందాలి. ఆ తర్వాత వైద్య డిగ్రీతో విదేశాల నుంచి తిరిగి వచ్చినప్పుడు ఎంసిఐ స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరవ్వడం, అందులో ఉత్తీర్ణత సాధిస్తే దేశంలో వైద్య వృత్తి చేసుకునేందుకు లైసెన్స్ ఇవ్వడం జరుగుతోంది. ఈ మేరకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా జారీ చేసింది.

## మోకాలడ్డుతున్న మెడికల్ కౌన్సిల్

ఇటీవలి కాలంలో అంటే 2006 జూన్‌లో మెడికల్ కౌన్సిల్ అర్హత పత్రం కోసం విద్యార్థులు చేసుకున్న దరఖాస్తులో కొన్ని విషయాలను పేర్కొంటూ మెడికల్ కౌన్సిల్ విదేశీ వైద్య విద్యపై కొత్తగా ఆంక్షల్ని విధించింది. దీంతో ఒక్కసారిగా భారత విద్యార్థుల ఆంక్షలు తుంచి వేసినట్లయ్యింది. తత్ఫలితంగా ప్రస్తుతం అమల్లోవున్న మెడికల్ కౌన్సిల్ సవరణ చట్టం (2001) అందజేసిన ఫలితాలు వైద్య విద్యార్థులకు అందడంలేదు. విదేశాల్లో ప్రాథమిక వైద్య విద్యార్హతను అందించగల ఏ సంస్థలోనైనా, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) ప్రచురించిన వరల్డ్ డైరెక్టరీ ఆఫ్ మెడికల్ స్కూల్స్‌లో ఉంటే ప్రవేశం పొందే అవకాశం ఈ చట్టం కల్పిస్తోంది. మెడికల్ కౌన్సిల్ చట్టం 1956లో గల షెడ్యూల్స్‌లో తెలిపిన విదేశీ మెడికల్ కాలేజీల్లో విద్యార్థులు చదవని పక్షంలో, వారికి ఎలిజిబిలిటీ సర్టిఫికెట్ ఇవ్వడం కుదరదంటూ ఎంసిఐ ఒక కొత్త ప్రతిబంధకాన్ని తెచ్చి పెట్టింది. విదేశీ వైద్య విద్యను కొనసాగించాలంటే స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరయ్యేందుకు అవసరమైన అర్హత పత్రాన్ని ఇచ్చేందుకు ఎంసిఐ నిరాకరించడంతో తమ డిగ్రీలకు గుర్తింపు లేకుండా పోయే పరిస్థితి ఏర్పడుతోంది. ప్రస్తుతం ఎంసిఐ పెట్టిన ఆంక్షల వల్లే ఈ పరిస్థితికి కారణమవుతోందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ఎంసిసి 1956లో గల షెడ్యూల్స్‌లో సిఐఎస్ దేశాలకూ, కొన్ని కామన్వెల్త్ రాజ్యాలకూ సంబంధించిన కొన్ని వైద్య సంస్థల్ని మాత్రమే ఉదహరించారు. ఎంసిఐ యాక్ట్ 1956లో గల షెడ్యూల్స్‌కు చివరిసారిగా వైద్య సంస్థల్ని 1986లో మాత్రమే పొందుపర్చారు. అదే సమయంలో గత సోవియట్ యూనియన్‌కు చెందిన 29 వైద్య సంస్థల్ని ఎంసిఐ చట్టం 1956లో షెడ్యూల్ 3, పార్ట్ 2లో చేర్చారు. 2001లో జరిగిన ఎంసిఐ చట్ట సవరణలో ఇకపై విదేశీ విద్యా సంస్థల్ని కలిపే విషయంపై అవకాశాల్ని పూర్తిగా నిలిపివేశారు. మాస్కోలోనూ, ఆల్మటీలోనూ గల భారతీయ రాయబార కార్యాలయాలు 1994 పూర్వార్ధంలో పంపిన నివేదికల ఆధారంగా, రష్యాలోనూ, సిఐఎస్ దేశాల్లోనూ వైద్య విద్యా ప్రమాణాలు దారుణంగా పడిపోవడం పట్ల ఎంసిఐ ఆందోళన వ్యక్తం చేసింది. అటుతర్వాత ఎంసిఐ రాసిన ఒక లేఖలో సోవియట్ యూనియన్ మెడికల్ డిగ్రీలను గుర్తించ వద్దంటూ భారత ఆరోగ్య శాఖను సిఫార్సు చేసింది. ఈ సందర్భంలో 1995 మార్చిలో కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటనను జారీ చేసింది.

## నిరాశ నిస్పృహల్లో భారత విద్యార్థులు

విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించేందుకు సమాయత్తమవుతున్న విద్యార్థులకు ఎంసిఐ అమలుపరుస్తున్న ఆంక్షలు తీవ్ర ప్రతిబంధకాలయ్యాయి. దేశవ్యాప్తంగా వందల కొద్దీ, వేలకొద్దీ గల విద్యార్థులు, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రచురించిన వరల్డ్ డైరెక్టరీ ఆఫ్ మెడికల్ స్కూల్స్‌లో ఉదహరించిన అంతర్జాతీయ ప్రమాణాలు గల చైనా, కిర్గిజిస్తాన్, సిఐఎస్ దేశాల్లో గల వైద్య సంస్థల్లో ప్రవేశాల్ని కోరుతున్నారు. అయితే ఇటీవల ఎంసిఐ విధించిన నిబంధనలతో వారు సతమతమవుతున్నారు. ఎంసిఐ విధించిన ప్రతిబంధకాల్ని సవాలు చేస్తూ కేరళ, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ హైకోర్టులలో రిట్ పిటిషన్‌లు దాఖలయ్యాయి. విద్యార్థులకు అనుకూలంగా ఈ కోర్టులు ఇంటీరియమ్ ఆదేశాలు జారీచేసినా, ఆఖరి తీర్పులకై విద్యార్థులు వేచి ఉండాల్సి వస్తోంది. ఎంసిఐ చట్టం( 1956)ను 2001లో చేసిన సవరణ ప్రకారం 33వ సెక్షన్‌లో వివరించిన ప్రకారం ఏ రకమైన నిర్ణయాలు తీసుకోదలచినా ముందుగా కేంద్ర ప్రభుత్వ అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాలి. అయితే ఎంసిఐ ఇటీవల ఆదేశించిన ప్రతిబంధకాలు ఢిల్లీ హైకోర్టు తీర్పులో గల అంశంపై వక్రభాష్యం చేశారే తప్ప ఇది ఏ విధంగానూ కేంద్ర ప్రభుత్వ అనుమతితో చేయలేదు. ఈ విషయంలో ఎంసిఐ ఏ రకమైన బాధ్యత వహించాల్సివస్తుందో ప్రజలే నిర్ణయించాలి. ఎంసిఐ చట్టంలో. ఇంతవరకు ఎటువంటి సవరణా చేయకపోగా కొత్త ఆదేశాలు కూడా తయారు కాలేదు. కొత్త మార్పుల పట్ల ఎంసిఐ ఎటువంటి ప్రకటనలూ చేయలేదు. 2002 నుంచి విద్యార్థులు అటువంటి సంస్థల్లో ప్రవేశించేందుకు ఏ రకమైన అడ్డూ లేకుండా ఎంసిఐలో అనుమతిస్తూ వచ్చారు. అలాంటప్పుడు క్రమ పద్ధతిలో ఉన్న విధానం నుంచి ప్రస్తుతం వేరే తరహాకు ఎందుకు మార్చారని విద్యార్థుల తల్లిదండ్రులు వాదిస్తున్నారు. దీంతో పలు సందిగ్ధాల విషయంలో సహేతుకంగా జవాబు చెప్పాల్సిన బాధ్యత ప్రస్తుతం ఎంసిఐపై ఉంది. దేశంలో వైద్య కళాశాలల ఏర్పాటుకు ఏమాత్రం సహకరించని ఎంసిఐ కనీసం విదేశాల్లో వైద్య విద్య అభ్యసించాలనుకున్నా అందుకు లేనిపోని అడ్డంకులు కల్పించడం వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. వైద్య విద్యను అభ్యసించడానికి దేశంలో విరివిగా వైద్య కళాశాలలు ఏర్పాటైతే తప్ప విదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య తగ్గే అవకాశం లేదు. ఈ విషయంలో ఎంసిఐ స్పందించి విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించేందుకు సహకరిస్తే బాగుంటుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.